క్లుప్తంగా

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



పట్టాలు అందుకున్న విద్యార్థులతో నన్నయ వర్సిటీ విశ్రాంత వీసీ ముత్యాలనాయుడు

ఆరిలోవ: స్థానిక భారతీ స్కూల్‌లో బుధవారం స్కూల్ గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ దుస్తులు వేసి పట్టాలు అందించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం నన్నయ వర్సిటీ విశ్రాంత వీసీ ప్రొఫెసర్ ముర్రు ముత్యాలనాయుడు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత విద్య అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ ఎం.వి.రావు, విద్యార్థుల ఇంగ్లిష్ ట్రైనర్ ఆలూరి రమేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా జాకబ్ రాజు



అధ్యక్షుడు జాకబ్ రాజు

ఎంవీపీ కాలనీ: గ్రేటర్ విశాఖ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన అధ్యక్షుడిగా ఎంవీపీ కాలనీకి చెందిన రెవ.ఎల్.జాకబ్ రాజు నియమితులయ్యారు. బుధవారం చినముషిడివాడలోని ఆంధ్ర బాప్టిస్ట్ చర్చిలో గ్రేటర్ విశాఖ పాస్టర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రెవ.ఎస్.జయకుమార్, కోశాధికారిగా రెవ.ఎం.కృపానంద్, ఉపాధ్యక్షులుగా బిషప్ పి.జక్కయ, రెవ. వి.జాన్ అప్పారావు తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు వారికి అభినందనలు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 10 మంది గైర్హాజరు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలలోని రెండు పరీక్ష కేంద్రాల్లో బుధవారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు పది మంది గైర్హాజరయ్యారు. కృష్ణా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 527 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. ఐదుగురు గైర్హాజరు అయ్యారు. కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో 532 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. ఐదుగురు గైర్హాజరయ్యారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధనేశ్వరరావు

ఎంవీపీ కాలనీ: బీజేపీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్.ధనేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ధనేశ్వరరావు 2014 నుంచి పార్టీలో విశేష సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆయనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

టీడీపీ వ్యవస్థాపక దినోత్సవం

ఆరిలోవ: టీడీపీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆరిలోవ ప్రాంతంలో ఆ పార్టీ నాయకులు బుధవా రం నిర్వహించారు. పదో వార్డులో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, 11వ వార్డులో పార్టీ అధ్యక్షు డు ముగడ రాజారావు, 12వ వార్డులో నాయకులు ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేకులు కట్ చేసి కార్యకర్తలు ఒకరికొకరు తినిపించుకున్నారు.

యువతి అదృశ్యం

పీఎం పాలెం: ఓ యువతి అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ వై .రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మధురవాడ భగవాన్ దాస్ కాలనీకి కెందిన ఎం. స్రవంతి(22) ప్రైవేటు కంపెనీలో టైలరింగ్ చేస్తుంటుంది. ఈ నెల 24వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ఇంటినుంచి వెళ్లిన ఆమె, మళ్లీ ఇల్లు చేరలేదు. చుట్టు పట్ల వెదికించినా ఫలితం లేకపోవడంతో ఆమె తండ్రి త్రినాథ్ పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

శ్రీరాములోరి కల్యాణం చూతము రారండి..!

- శ్రీరామ నవమికి ఆలయాలు సిద్ధం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఉత్సవ కమిటీలు

ఆరిలోవ: శ్రీరామనవమి పూజలకు తూర్పు నియోజకవర్గంలో పలు ఆలయాలు సిద్ధమయ్యాయి. గురువారం నిర్వహించే సీతారాముల కల్యాణోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. రామాలయాలు, ఆంజనేయస్వామి, వేంకటేశ్వర స్వామి ఆలయాలను ఇప్పటికే ముస్తాబు చేశారు. ఆరిలోవ పరిధిలోని ఆలయాలకు పెయింటింగ్‌లు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. తాటి, కొబ్బరి కమ్మలతో పందిళ్లు వేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయాల సమీపంలో రోడ్లకు ఇరువైపులా సీతారాముల ఫొటోలతో ఆలయాల కమిటీ సభ్యులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులతో కూడిన స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో ఆయా ప్రాంతాల్లో సందడి నెలకొంది. పైనాపిల్ కాలనీ, దుర్గాబజార్, ఎస్‌ఐజీ నగర్, ఇందిరానగర్, విశాలాక్షినగర్‌లలో రామాలయాలు, హనుమంతవాక వద్ద కోదండ రామాలయం, వెటర్నరీ కాలనీ, శ్రీహరినగర్, భరత్‌నగర్‌లలో వేంకటేశ్వర స్వామి ఆలయాలు, శ్రీకాంతనగర్‌లో ఆంజనేయస్వామి ఆలయం, చినగదిలి నార్త్ షిరిడీ సాయిబాబా, ఆంజనేయస్వామి ఆలయాలను శ్రీరామ నవమి పూజల కోసం సిద్ధం చేశారు. సీతారామ కల్యాణం అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించనున్నారు. ఆరిలోవ పోలీసులు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయాల బందోబస్తు నిర్వహించనున్నారు.



ఆరిలోవ దుర్గాబజార్‌లో పూజలకు సిద్ధం చేస్తున్న రామాలయం



శ్రీకాంత్‌నగర్‌లో సీతారామ కల్యాణానికి సిద్ధమైన ఆంజనేయస్వామి ఆలయం

జాతరలో చిన్నారులకు ప్రత్యేక ఏర్పాట్లు అవసరం



ట్రస్ట్‌బోర్డు సభ్యులతో మాట్లాడుతున్న సీతారాం

ఏయూ క్యాంపస్: శ్రీకరక చెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానం వార్షిక జాతరను పురస్కరించుకుని ఆలయం వద్ద చిన్నారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు, దేవదాయ శాఖ అధికారులు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, 1098 చైల్డ్ లైన్ ప్రతినిధులు, వార్డు సచివాలయం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనుపు ఉత్సవంలో హాజరయ్యే వేలాది మంది పిల్లలకు ఎటువంటి సదుపాయాలు కల్పిస్తున్నారని ఆలయ ఈవో డి.వి.ఎస్.సురేష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖ తరపున హాజరైన డాక్టర్ జగదీష్ చంద్ర ఆలయ ప్రాంగణంలో ప్రాథమిక వైద్య సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నా రు. అనంతరం కమిషన్ సభ్యుడు సీతారాం మాట్లా డుతూ ఏడాదిలోపు వయసున్న పిల్లల తల్లిదండ్రులను ప్రత్యేక క్యూలైన్‌లో ప్రవేశం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ పి.శంకర్‌రెడ్డి, ట్రస్టీలు ఎం. మంగరాజు, ఎస్. కృష్ణమోహన్, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షురాలు ఎం.ఆర్.ఎల్.రాధ, సభ్యులు సూర్యనారాయణ, విజయలక్ష్మి, అర్బన్ సీడీపీవో శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, ఐసీపీఎస్ ప్రతినిధి ఆనంద్, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఫెర్రో అల్లాయిస్ ఉత్పత్తిదారుల అసోసియేషన్ అధ్యక్షుడు షరఫ్

దాబాగార్డెన్స్: ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఫెర్రో అల్లాయిస్ ఉత్పత్తిదారుల అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే షరఫ్ కోరారు. నగరంలోని ఓ హోటల్లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ దేశాల్లోని ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలకు విద్యుత్ యూనిట్ రూ.3 కంటే తక్కువకే లభిస్తుందన్నారు. మన దేశంలో కూడా పలు రాష్ట్రాల్లో విద్యుత్ చౌక ధరకే లభిస్తున్నందున అక్కడి ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలు వాటి మనుగడను నిలబెట్టుకుంటున్నాయని చెప్పారు. ఫెర్రో ఉత్పత్తుల తయారీ పరిశ్రమలకు అత్యంత అవసరమైన ముడి పదార్థం విద్యుత్ సరఫరా అని, ఉత్పత్తి ఖర్చులో ఆయా ఫెర్రో అల్లాయిస్ స్వభావాన్ని బట్టి 35 నుంచి 70 శాతం ఖర్చు విద్యుత్ కొనుగోలుకు వెచ్చిస్తున్నట్టు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలను ప్రత్యేక తరగతికి చెందిన పరిశ్రమగా గుర్తించి ఎన్టీపీసీ నుంచి విద్యుత్ సరఫరా కేటాయింపులు చేయాలన్నారు. రాష్ట్రంలో 39 ఫెర్రో పరిశ్రమలుండగా.. 33 యూనిట్లు 700 ఎంవీఏ పైగానే కాంట్రాక్టెడ్ ఎండీతో నడుస్తూ 40 వేల మంది కార్మిక కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధి శర్మ పాల్గొన్నారు.

మధురవాడ మార్కెట్ వేలం ఖరారు



వేలంపాట నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ అప్పలరాజు

మధురవాడ: జీవీఎంసీ జోన్-2లోని మధురవాడ డైలీ మార్కెట్, వారపు సంత, రోడ్డు మార్జిన్ వేలం పాట ఖరారైంది. బుధవారం సాయంత్రం జోనల్ కార్యాలయంలో జెడ్సీ కనక మహాలక్ష్మి పర్యవేక్షణలో సూపరింటెండెంట్ అప్పలరాజు పాట నిర్వహించారు. ఇక్కడ ముడసర్లోవ పార్కు ప్రవేశ రుసుము, పార్కింగ్, క్యాంటీన్, ఐస్‌క్రీం బండ్ల నిర్వహణ వంటివాటికి ఒక్కరే రావడంతో మళ్లీ వాయిదా పడ్డాయి. మార్కెట్ పాట మాత్రం విజయనగరానికి చెందిన పి. నారాయణరావు 21లక్ష 8వేల రూపాయలకు కై వసం చేసుకున్నారు. దీనికి జీఎస్టీ, స్వచ్ఛభారత్ సెస్ కలిపి మొత్తంగా 25లక్షలు చెల్లించాల్సి ఉంటుందని అప్పలరాజు చెప్పారు.

సీఎంఎం విభాగాధిపతికి అభినందనలు



నూతన విభాగాధిపతి గణేష్‌కుమార్‌ను అభినందిస్తున్న ఐఎన్టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అధిక ఉత్పత్తి సాధించే దిశగా ఉద్యోగులందరూ శ్రమించాలని స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ మెయింటెనెన్స్ మెకానికల్ (సీఎంఎం) జనరల్ మేనేజర్ గణేష్‌కుమార్ కోరారు. సీఎంఎం నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం స్టీల్ ఐఎన్టీయూసీ నాయకులు ఆయనను కలిసి శాలువా కప్పి, బొకేతో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తుకు అధిక ఉత్పత్తి సాధించడం ఆవశ్యమన్నారు. అంతకు ముందు ఐఎన్టీయూసీ నాయకులు విభాగం కార్మికుల సమస్యలను ఆయనకు వివరించారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ కార్యదర్శి పి.ఎస్.వి.ఎస్. గోపాల్, నాయకులు వాసు, బి. స్వామినాథం, వి.వి.శెట్టి తదితరులు పాల్గొన్నారు.


ఇంటర్ విద్యార్థి అదృశ్యం



హర్షవర్ధన్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌నకు చెందిన ఇంటర్ విద్యార్థి అదృశ్యంపై స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి రామకుమార్ కుమారుడు జి. హర్షవర్ధన్ (18) స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఉదయం కెమిస్ట్రీ పరీక్షకు వెళ్లాల్సిన హర్షవర్ధన్ బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు లేచి, చదవడానికి బయటకు వెళ్లాడు. ఆ తర్వాత ఇంటికి చేరలేదు. తల్లిదండ్రులు పరీక్ష కేంద్రానికి వెళ్లి వాకబు చేయగా హాజరు కాలేదని తెలిసింది. చుట్టు పక్కల వెదికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు స్టీల్‌ప్లాంట్ సీఐ శ్రీనివాసరావును 94407 96015 నంబర్‌లో గానీ లేదా విద్యార్థి తండ్రిని 91215 69942 నంబర్‌లో గానీ సంప్రదించాలని సూచించారు.

షాట్‌పుట్‌లో దీక్షిత ప్రతిభ



వద్ది దీక్షిత మైటీ

తగరపువలస: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం - విజయవాడ అంతర కళాశాలల అథ్లెటిక్ పోటీల్లో షాట్‌పుట్ విభాగంలో సంగివలస అనిల్ నీరుకొండ దంతవైద్య కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థిని వద్ది దీక్షిత మైటీ రన్నర్‌గా నిలిచింది. ఇటీవల ఆంధ్రా మెడికల్ కళాశాల వేదికగా ఈ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో డైరెక్టర్ ఎస్.ఆర్.కె.రెడ్డి, సీఈవో నిరంజన్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి, ఏవో జేవీడీ నాయుడు, ఫిజికల్ డైరెక్టర్ గున్నాజీ తదితరులు దీక్షితను అభినందించారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో విజ్ఞాన్ విద్యార్థికి పతకం

అగనంపూడి: జోన్-1 బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి షణ్ముఖ వెంకట సునీల్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ నెల 26వ తేదీన కాకినాడ గోల్డెన్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 16 జిల్లాలకు చెందిన బాడీ బిల్డర్లు పోటీల్లో పాల్గొనగా, సునీల్ ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకున్నాడు. ఈ మేరకు కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సునీల్‌ను కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వ్యాయామ విద్య అధ్యాపకులు సీహెచ్.రాంబాబు, జె.ప్రశాంత్. పి.ఎస్.వి.రమణ, భారతి అభినందించారు.

ఇసుకతోటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



ఇసుకతోటలో ప్రజలతో మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల

మద్దిలపాలెం: పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట గ్రామంలో కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావుతో కలిసి ఆమె గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలతో ఇంత వరకూ ఎంత లబ్ధి చేకూరిందో తెలియజేస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సిహెచ్.నాగేశ్వరరావు, పోలరత్నం, పార్వతి, మీసాల ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

శివాలయ హుండీ ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కిస్తున్న శ్రీహరి సేవకులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. దేవదాయ శాఖ సూపర్‌వైజర్(ఈవో) కె.పద్మావతి పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వహణాధికారి పైలా శేఖర్‌బాబు ఆధ్వర్యంలో అర్చకులు, శ్రీహరి సేవకులు, ట్రస్టీ సభ్యులు, సిబ్బంది ఆదాయం లెక్కించారు. ఈ సందర్భంగా ఈవో శేఖర్‌బాబు మాట్లాడుతూ 90 రోజులకు గానూ భక్తుల దక్షిణ రూపంలో రూ.1,90,200 ఆదాయం వచ్చిందని తెలిపారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

సీతమ్మధార: జీవీఎంసీ 27 వార్డు దొండపర్తిలో కొలువుదీరిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శ్రీనివాస్ భక్తుల నామాగోత్రాలతో అర్చనలు చేశారు. సాయంత్రం భక్తులు అమ్మవారికి జలాభిషేకం అనంతరం అమ్మవారికి పసుపు, కుంకుమలతో అర్చనలు జరిపారు.

నేడు శిల్పారామంలో నృత్య ప్రదర్శనలు

పీఎం పాలెం: శిల్పారామం జాతరలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథ రెడ్డి తెలిపారు. విజయనగరానికి చెందిన శ్రీ విజయ నృత్య కళానికేతన్ ఆధ్వర్యంలో కూచిపూడి, జానపద నృత్యాల ప్రదర్శన ఉంటుందని తెలియజేశారు.

కల్యాణం.. కమనీయం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

వార్షిక కల్యాణోత్సవానికి అశోక్‌కు ఆహ్వానం

సింహాచలం: వచ్చేనెల 2వ తేదీన జరగనున్న వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవానికి సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజుకు బుధవారం దేవస్థానం అధికార, వైదికులు ఆహ్వానం పలికారు. విజయనగరంలోని ఆయన స్వగృహానికి వెళ్లిన దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈ శ్రీనివాసరాజు అశోక్‌గజపతికు ఆహ్వాన పత్రిక అందజేశారు.

ఏయూ సమాచారం...

వ్యసనాలకు దూరంగా యువత



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ జె.మాధవి

ఏయూ క్యాంపస్: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని డిప్యూటీ కలెక్టర్ జె.మాధవి అన్నారు. బుధవారం ఏయూ ఫార్మసీ కళాశాల సమావేశ మందిరంలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువతరం ఆరోగ్య జీవనం అలవరచుకోవాలని సూచించారు.

ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ 'సే నో టు డ్రగ్స్'అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. యువత పెడతోవ పట్టకుండా వారిలో మంచి ఆలోచనలు పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ 14500 ఏర్పాటు చేసి యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచే ప్రయత్నం చేస్తోందన్నారు. ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ చైర్మన్ ఉమారాజ్, ప్రభుత్వ మానసిక వైద్యశాల వైద్యులు డాక్టర్ కె.ప్రభాత్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ ఎల్.మాధవి, ఎక్సైజ్ విభాగం ఎస్ఐ జి.రాజేశ్వరి, ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.శైలజ పాల్గొన్నారు.

వృక్షశాస్త్ర విభాగం సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగాన్ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విభాగంలో ఉన్న వివిధ మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు స్వయంగా అభివృద్ధి చేస్తున్న పలు మొక్కలతో కూడిన నర్సరీని పరిశీలించారు. విద్యార్థులను అడిగి మొక్కల వివరాలు, ప్రత్యేకతలు, వాటిని పెంచే విధానం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించే విధంగా కృషి చేయాలని సూచించారు. వర్సిటీలో నూతనంగా నిర్మించే పలు భవనాల వద్ద సుందీకరణ, మొక్కలు నాటే కార్యక్రమంలో విలువైన సూచనలు వృక్షశాస్త్ర విభాగం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.రత్నకుమార్, బ్యూటిఫికేషన్ విభాగం డీన్ డాక్టర్ ఉజ్వల్ కుమార్ ఘటక్, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుకన్య సమృద్ధి యోజనపై విస్తృత అవగాహన

ఎంవీపీ కాలనీ: ఆడపిల్లల భవిష్యత్ ఆర్థిక భరోసా కోసం కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సుకన్య సమృద్ధి యోజన పథకంపై రీజనల్ పోస్టల్ కార్యాలయం ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కల్పించారు. బుధవారం లాసన్స్‌బే కాలనీ పోస్ట్ ఆఫీసులో జరిగిన ఈ కార్యక్రమంలో పోస్టల్ శాఖ విశాఖ రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ డబ్ల్యూ.నాగ అదిత్యకుమార్ మాట్లాడుతూ సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా ప్రతి ఇంటి ఆడపిల్లకు మంచి జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అత్యధిక వడ్డీ రేటును అందిస్తుందన్నారు. ఆడ పిల్ల 18 ఏళ్లు నిండే వరకు డబ్బులు జమ చేస్తే తనకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. అనంతరం పలువురు ఖాతాదారులకు పథకం వివరాలతో కూడిన కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వం బాధ్యతను విస్మరించడం దుర్మార్గం'

- కార్పొరేటర్ గంగారావు
- ఈవోఐకు వ్యతిరేకంగా స్టీల్ సీఐటీయూ మిత్రపక్షాల ధర్నా



ధర్నాలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: ప్రజా సంపద అయిన స్టీల్‌ప్లాంట్‌పై ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించడం దుర్మార్గమని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సీఐటీయు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి అన్నారు. ఇటీవల ఉక్కు యాజమాన్యం ముడిసరకు కోసం ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) ప్రకటన చేయడానికి నిరసనగా స్టీల్ సీఐటీయూ మిత్రపక్షాల ఆధ్వర్యంలో బుధవారం ఉక్కు పరిపాలన భవనం కూడలి వద్ద ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలంటూ యాజమాన్యం స్థానిక కార్మిక సంఘాలతో చర్చించకుండా ప్లాంట్ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేసేలా నిర్ణయాలు తీసుకోవడం అన్యాయమన్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అన్ని కార్మిక సంఘాలు కేంద్ర ఉక్కుశాఖా మంత్రికి విజ్ఞప్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. యాజమాన్యం వెంటనే ఆ ప్రతిపాదనను విరమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వై.టి. దాస్, మిత్రపక్షాల నాయకులు డి.వి. రమణారెడ్డి, డి. సురేష్‌బాబు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికులకు మరిన్ని సదుపాయాలు



కోరాపుట్ రైల్వే స్టేషన్‌లో పర్యటిస్తున్న పాసింజర్ ఎమినిటీస్ కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: రైల్వే బోర్డుకు చెందిన ప్రయాణికు ల సదుపాయాల కమిటీ(పాసింజర్ ఎమినిటీస్ కమిటీ) సభ్యులు బుధవారం కూడా వాల్తేర్ డివిజన్‌లో పర్యటించారు. కొత్తవలస-కోరాపుట్ లైన్‌లోని దమన్‌జోడి, కోరాపుట్ రైల్వ స్టేషన్లలో సభ్యులు దిలీప్‌కుమార్ మల్లిక్, అభిజిత్‌దాస్, నిర్మలకిషోర్ బొల్లిన, గొట్టాల ఉమారాణి, డాక్టర్ జి.వి.మంజుల, పరశురాం మహతో తనిఖీలు చేపట్టారు. ఆయా స్టేషన్లలో ప్రయాణికుల కనీస సదుపాయాలైన తాగునీరు, వెయింటింగ్ హాల్స్, మరుగుదొడ్లు, ప్లాట్‌ఫాం పైకప్పులు, పాదచారుల వంతెనలు, కూర్చునే సదుపాయాలు, కేటరింగ్ స్టాల్స్ వంటి వాటితోపాటు పరిశుభ్రత, కేటరింగ్ స్టాల్స్ వద్ద ఆహార నాణ్యతలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా వెయిటింగ్ హాల్స్, ప్లాట్‌ఫారాలపై గల ప్రయాణికులతో కమిటీ సభ్యులు మాట్లాడి, వారి సూచనలు తీసుకున్నారు. ఈ స్టేషన్లలో అమృత్ భారత్ పథకం కింద మరిన్ని సదుపాయాలను సమకూర్చనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పర్యటనలో డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అవినాష్ శర్మ, ఎలక్ట్రికల్, సిగ్నల్, టెలికం, సివిల్ ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.